క్లుప్తంగా

జాలరిపేటలో ఎంపీ ఎంవీవీ పర్యటన



సహపంక్తి భోజనం చేస్తున్న విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శనివారం జాలరిపేటలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి యోగ క్షేమాలు, అక్కడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జాలరిపేటలోని పిల్లా అల్లాప్పా, కంబాలిల ఇంట్లో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీలయ్య కుటుంబానికి ఎంవీవీ పరామర్శ

ఎంవీపీకాలనీ: అనారోగ్యంతో మృతి చెందిన చింతపల్లి గాంధీలయ్య(65) కుటుంబ సభ్యులను విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. శనివారం జాలరిపేటలోని గాంధీలయ్య ఇంటికి వెళ్లి అతిడి భార్యతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులతో ఏపీసీ వివేకానంద, ఫరూఖీ, ఉషశ్రీ

మద్దిలపాలెం: విద్యార్థులు విద్యతోపాటు ఆసక్తి గల అన్ని రంగాల్లో రాణించాలని దిశా అసిస్టెంట్ ఆఫ్ పోలీస్ కమిషనర్ సిహెచ్.వివేకానంద అన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన గురుస్థానం స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూఖీతో కలిసి ప్రతిభ చూపిన చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ మాట్లాడుతూ చిన్నారుల క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పాదయాత్రకు సీపీఎం మద్దతు



మాట్లాడుతున్న జగ్గునాయుడు, బొట్టా ఈశ్వరమ్మ

మద్దిలపాలెం: ఈ నెల 3న జరగనున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పాదయాత్రకు సీపీఎం సంపూర్ణ మద్దతిస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యురాలు బొట్టా ఈశ్వరమ్మ తెలిపారు. పిఠాపురం కాలనీలో శనివారం మీడియాతో వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1,115 రోజులుగా విశాఖ ప్రజలు, కార్మికులు, ప్రజా సంఘాలు ఉద్యమిస్తున్నామన్నారు. ఉదయం 6 గంటలకు కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకూ తలపెట్టిన పాదయాత్రను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

- రానున్న ఎన్నికల్లో విశాఖ పార్లమెంట్, గాజువాక అసెంబ్లీ స్థానాల్లో పోటీకి సీపీఎం అభ్యర్థులు బరిలో ఉంటారని జగ్గునాయుడు తెలిపారు.

సుపరిపాలనతో అందరికీ మేలు

- సీఎం జగన్ పాలనలో గడప గడపకూ సంక్షేమ పథకాలు
- వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ
- ఎంపీ ఎంవీవీతో కలిసి 28వ వార్డులో పాదయాత్ర



వృద్ధురాలికి పథకాలు వివరించి.. ఆప్యాయంగా పలకరిస్తున్న బొత్స ఝాన్సీ



28వ వార్డులో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బొత్స ఝాన్సీ, ఎంపీ ఎంవీవీ

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలకు వరమని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపకూ మేలు జరుగుతోందని పేర్కొన్నారు. విశాఖ ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శనివారం జీవీఎంసీ 28వ వార్డులో చేపట్టిన పాదయాత్రలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన వైఎస్ జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు లబ్ధిపొందుతున్నారని చెప్పారు. తద్వారా కుటుంబ ఆర్థికాభివృద్ధి సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ పాలన జనరంజకంగా సాగుతోందన్నారు. ఆయన బాటలో తామంతా నడిచి ప్రజలకు సేవ చేస్తామని, తమను ఆశీర్వదించాలని బొత్స ఝాన్సీ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో 53 రోజులుగా పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తూర్పు నుంచి తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోల గురువులు, కార్పొరేటర్ పల్లా అప్పల కొండ, పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, తూర్పు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

స్మారక బహుమతికి విరాళం



ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి విరాళం డీడీ అందిస్తున్న ఆచార్య సరస్వతి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నృత్య విభాగంలో స్మారక బహుమతిని ఏర్పాటు చేశారు. విభాగ ఆచార్యురాలు కె.సరస్వతి విద్యార్థి తన సొంత నిధుల నుంచి రూ 1.5 లక్షలు విరాళంగా అందించి 'కూచిపూడి పితామహ శ్రీ సిద్ధేంద్రయోగి మెమోరియల్ ప్రైజ్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని ఆమె కలిసి ప్రైజ్ ఏర్పాటుకు అవసరమైన నిధులకు సంబంధించిన డీడీని అందించారు. విభాగంలో ఎంఏ డ్యాన్స్‌లో మెదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఈ ప్రైజ్ ఇవ్వాలని సరస్వతి కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'మెటీరియల్స్ అండ్ టెక్నాలజీస్'పై సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో శనివారం మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల్లో మెటీరియల్స్ అండ్ టెక్నాలజీల వినియోగం అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ, ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ వైజాగ్ చాప్టర్ విశాఖ ప్రాంతీయ కేంద్రాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఐఐటీ మద్రాసు సివిల్ ఇంజినీరింగ్ విభాగ విశ్రాంత ఆచార్యుడు రాజగోపాల్ స్థిరమైన నిర్మాణాల కోసం జియోసింథటిక్స్ వినియోగంపై ప్రసంగించారు. జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణాలు, పేవ్‌మెంట్‌ల నిర్మాణం వంటివి పలు ఉదాహరణలతో వివరిస్తూ జియో సింథటిక్స్ ఉపయోగాలు, అనువర్తనాలను తెలియజేశారు. స్ట్రైజా గ్లోబల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బి.వి.నాగరాజ్ కుమార్ మాట్లాడుతూ ఎత్తయిన వాణిజ్య నిర్మాణాలు, బ్రిడ్జిల నిర్మాణాల విధానాన్ని వివరించారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఏజీఎం(టెక్నికల్) కె.వెంకట రామన్ మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో కాంక్రీట్ నిర్మాణాల మరమ్మతులు, నిర్వహణ వ్యయాన్ని తగ్గిస్తూ వాటి జీవిత కాలాన్ని పెంచడంలో కాంక్రీట్ ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య పి.వి.వి.సత్యనారాయణ, ఆచార్య కె.దుర్గారాణి, ఆచార్య ఆదిశేషు, డాక్టర్ కె.రాజశేఖర్, వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, పలు ప్రభుత్వ రంగ సంస్థల ఇంజినీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలతో సత్కారం



12వ వార్డు వలంటీర్లతో జీవీ, కార్పొరేటర్ రోహిణి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. వార్డులోని 139 మంది వలంటీర్లను ముఖ్య అతిథి స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు(జీవీ) చేతుల మీదుగా శాలువాలతో సత్కరించి సేవా పురస్కార ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి వలంటీర్లు వెన్నెముకలాంటివారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సేవలందించే అదృష్టం వలంటీర్లకు దక్కిందని పేర్కొన్నారు. వలంటీర్ల సేవలను కార్పొరేటర్ రోహిణి కొనియాడి అభినందించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, కనకరాజు, కొండమ్మ, అర్జున్, మోహన్, సూర్యారావు, వరహాలరావు, శ్రీను, సత్యనారాయణ, సుజాత, గ్లోరీ, రాజులమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



మెహరున్నీసా బేగం, దిలీప్‌కుమార్‌లను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన మెహరున్నీసా బేగం, డి.దిలీప్‌కుమార్‌లను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో అభినందించారు. మెహరున్నీసా బేగం ఇటీవల జరిగిన సౌత్ వెస్ట్ జోన్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. దిలీప్‌కుమార్ ఎన్‌సీసీ తరపున 75వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిని వీసీ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, విభాగాధిపతి ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్షియల్ రిపోర్టింగ్‌పై అతిథి ఉపన్యాసం



చార్టెడ్ అకౌంటెంట్ శామ్యూల్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శనివారం ×ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అండ్ కార్పొరేట్ ఫెయిల్యూర్స్₹ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. చార్టెడ్ అకౌంటెంట్ శామ్యూల్ నాగదేశీ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. దేశ విదేశాల్లో కార్పొరేట్ ఫెయిల్యూర్స్ జరిగిన విధానాన్ని ఉదాహరణలతో వివరించారు. దేశంలో 1998లో జరిగిన వేస్ట్ మేనేజ్‌మెంట్ కుంభకోణం, 2001లో ఎన్రాన్ కుంభకోణం, 2002లో టైకో కుంభకోణం, 2003లో హెల్త్ సౌత్ కుంభకోణం, ఫ్రెడీ మాక్ కుంభకోణం, 2005లో అమెరికన్ ఇన్సూరెన్స్ గ్రూప్ కుంభకోణం, 2008లో లెహమాన్ బ్రదర్స్, బెర్నీ నాడాఫ్ కుంభకోణం, 2009లో జరిగిన సత్యం కుంభకోణలను కేస్ స్టడీలుగా వివరించారు. ఇంటర్నల్ ఆడిట్ ఫ్రేమ్ వర్క్ ఉపయోగించి ఫైనాన్షియల్ రిపోర్టింగ్ ఏ విధంగా చేయాలో వివరించారు. ప్రతి ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి తన భవిష్యత్తులో ఫైనాన్షియల్ రిపోర్టింగ్‌లో తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ శామ్యూల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ బి.సుబ్బయ్య, కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తుల మధ్య వారధి భాష



సర్టిఫికెట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: వ్యక్తుల మధ్య వారధిగా భాష నిలుస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ అలుమ్ని సమావేశ మందిరంలో ఏయూ టీడీఆర్ హబ్, తెలుగుమల్లి(ఆస్ట్రేలియా) సంయుక్తంగా శనివారం నిర్వహించిన ప్రవాస సాహిత్యం రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో అన్ని భాషలకు ప్రాధాన్యం, ప్రాముఖ్యత కల్పిస్తున్నారన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎ.సీతామాణిక్యం మాట్లాడుతూ సదస్సులో భాగంగా 130 పరిశోధన పత్రాలను ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ విధానంలో సమర్పించారన్నారు. అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలపై నిర్వహించిన సదస్సులో విశేషమైన చర్చలు జరిపి జ్ఞానాన్ని పెంచుకోవడం మంచి పరిణామమన్నారు. తెలుగుమల్లి అధ్యక్షుడు కె.మల్లికేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంతో ఘనంగా అంతర్జాతీయ సదస్సును నిర్వహించిందని ప్రశంసించారు. సదస్సులో పాల్గొన్న వారికి రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో సహ కన్వీనర్లు ఆచార్య జె.విజయభారతి, డాక్టర్ కె.రాజ మాణిక్యం, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ సుజాత

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం మీదుగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎన్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ప్రొగ్రామ్ అధికారి కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కాలేజీలో మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న పోలా భాస్కర్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కరావు చేతుల మీదుగా మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యా శాఖ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎన్ఆర్‌సీలుగా గుర్తింపు పొందాలన్నారు. కళాశాల అధ్యాపకులు కంటెంట్ అభివృద్ధి కోసం వీటిని ఉపయోగించాలని సూచించారు. దృశ్య శ్రవణ విధానంలో అధ్యాపకులు పాఠ్యాంశాలను బోధిస్తారన్నారు. వాటిని కళాశాల యూట్యూబ్ ఛానల్‌లో వీక్షణ ద్వారా విద్యార్థులు ఎప్పుడైనా చూడగలుగుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో శనివారం 21వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరికలు జరగడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వార్డు ఎస్సీ సెల్ కార్యదర్శి చెన్న సంగీతరావు, నక్క శ్రీను, బంగారాజు, మనోహర్, జగదీప్, భరత్, కుమారి, మోహన్ సతీష్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

సీతంపేట: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో 25వ వార్డు సీతంపేటలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జూ సందర్శకులకు ఆరోగ్యంపై అవగాహన




సందర్శకుల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్న సదరన్ విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సందర్శకులకు శనివారం జూ పార్కు, సదరన్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూ పార్కుకు వెళ్లిన సందర్శకులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు అవగాహన కల్పించారు. సందర్శకుల బరువు, ఎత్తు పరిశీలించారు. వయసును బట్టి ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఛీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) శ్రీకంఠనాధరెడ్డి మాట్లాడుతూ జూ సందర్శకులకు ఇలాంటి ఆరోగ్యకరమైన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. జూ క్యూరేటర్ నందనీ సలారియా, డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సదరన్ విద్యా సంస్థల సీఎండీ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కడ నాటుతున్నారు.. ఇక్కడ తొలగిస్తున్నారు

చెట్ల నరికివేతతో పచ్చదనానికి తూట్లు



హెల్త్‌సిటీకి వెళ్లే దారిలో రోడ్డు పక్కన జీవీఎంసీ నాటిన చెట్లు



సంజయ్‌గాంధీ కాలనీలో షిర్డీసాయిబాబా మందిరం ముందు తొలగిస్తున్న చెట్లు

ఆరిలోవ: పచ్చదనం, ఆహ్లాం కోసం జీవీఎంసీ అధికారులు మొక్కలు, చెట్లు నాటిస్తున్నారు. మరో పక్క కొందరు స్థానికులు ఆ చెట్లను నాశనం చేస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ కొన్ని చోట్ల చేపట్టిన అభివృద్ధి పనుల వద్ద చెట్లను తొలగించాల్సి వస్తోంది. పచ్చదనాన్ని దృష్టిలో పెట్టుకున్న అధికారులు చెట్లను నరికి వృథా చేయడం లేదు. వాటిని వేళ్లతో సహా తొలగించి వేరే చోట నాటుతున్నారు. అవి మళ్లీ యథావిధిగా చిగురిస్తున్నాయి. పచ్చదనాన్ని అందిస్తున్నాయి. కొద్ది రోజులుగా పెదగదిలి వద్ద గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. దానికి అడ్డుగా ఇరుపక్కలా ఉన్న పలు రకాల చెట్లను వేళ్లతో తొలగించి ఆరిలోవ కాలనీ చివరన హెల్త్ సిటీకి వెళ్లే రోడ్డుకు ఇరుపక్కలా, శ్రీకాంత్‌నగర్ గెడ్డ అంచున సుమారు 40 చెట్లు నాటించారు. అవన్నీ చిగురిస్తున్నాయి.

బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న చెట్లను సంజయ్‌గాంధీ కాలనీ వద్ద తొలగింపునకు గురవుతున్నాయి. ఇక్కడ షిర్డీసాయిబాబా మందిరం చెట్ల మాటున ఉండి రోడ్డుపైకి కనిపించడం లేదనే ఆలోచనతో ఆలయ నిర్వాహకులు ఆరు నెలల కిందట సుమారు 30 చెట్లు నరికేశారు. ఇప్పుడు మరో నాలుగు పెద్ద చెట్లను తొలగించేస్తున్నారు. దీంతో ఇక్కడ గ్రీన్‌బెల్ట్‌కు తూట్లుపడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోను ఒకే విధంగా పచ్చదనం ఏర్పాటు చేయడం, ఉన్నదాన్ని సంరక్షించడంపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'బౌద్ధ విజ్ఞానం - లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజధమ్మా తదితరులు

సీతంపేట: ఆచార్య కె.ఎస్.చలం రచించిన 'బౌద్ధ విజ్ఞానం - లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం, పంచశీల ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ముఖ్య అతిథి బిఖ్ఖు రాజధమ్మా(మయన్మార్) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాది అనే స్వార్థాన్ని ప్రతి ఒక్కరూ వీడాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధం విస్తరించి ఉందని చెప్పారు. రచయిత కె.ఎస్.చలం మాట్లాడుతూ బుద్ధుడి బోధనలు, బుద్ధుడి జీవితంతో పెనవేసుకున్న ఈ ప్రాంతంలో బౌద్ధ విజ్ఞాన కేంద్రం నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. బౌద్ధంపై పరిశోధనల కోసం బుద్ధ విజ్ఞాన కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనేక పుస్తకాలు, పరిశోధన గ్రంథాలను పరిశీలించి ఈ పుస్తకాన్ని రచించినట్లు చెప్పారు. సభాధ్యక్షుడు ప్రొఫెసర్ వి.వెంకటరావు మాట్లాడుతూ బౌద్ధ మతానికి ఈ పుస్తకం ఒక నిఘంటువుగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ ముత్యాలనాయుడు, ఆచార్య చందు సుబ్బారావు, ఆకాశవాణి వ్యాఖ్యాత కూర్మాన శ్రీదేవి, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జె.వి.సత్యనారాయణమూర్తి, మాటూరి శ్రీనివాస్, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఎస్.హనుమంతరావు, పి.శ్యాంసుందర్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

సీతమ్మధార: పాత్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం సత్యం జంక్షన్‌లో ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు సమక్షంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవ్ చేసే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.